www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 1 సెప్టెంబర్ 2025
5
వైఎస్ఆర్

సిబ్బంది సేవలు చిరస్మరణీయం : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్రమశిక్షణ, అంకితభావంతో నాలుగు దశాబ్దాలపాటు నిర్విరామంగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. విరమణ పొందిన సిబ్బందిని ఆదివారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందచేసి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలో ప్రత్యేక స్థానంలో ఉండడానికి సిబ్బంది సేవలే కీలకమన్నారు. ఎలాంటి సెల్ ఫోన్లు, కమ్యూనికేషన్ లేని రోజుల్లో కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించడం మామూలు విషయం కాదని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో సమాజానికి అత్యంత సన్నిహితంగా మెలిగే వ్యక్తి కానిస్టేబుల్ అని, కానిస్టేబుల్ పోలీస్ శాఖకు వెన్నెముక లాంటి వారని అభివర్ణించారు. వ్యక్తిగత, వృత్తిగత జీవితాన్ని సంతులనం చేసుకుంటూ పిల్లలను ఉన్నతస్థాయిలో తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. గడుపుతూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

'అన్నమయ్య'కు పునరుద్ధరణేది!

- ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువు
- జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు మోక్షమెప్పుడో
- ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం ఏదీ
- నేడు రాజంపేటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాక

అన్నమయ్య జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. జిల్లా రాజకీయ నాయకత్వం చిత్తశుద్ధి లేమి, కూటమి సర్కారు నిర్లక్ష్యం వెరసి జిల్లా ప్రగతి నీరోడుతోంది. దీనికితోడు సాగునీటి ప్రాజెక్టుల పనులు, నిర్వాసితులకు అందని పరిహారం, ఉద్యాన సాగుకు కొరవడిన ప్రోత్సాహం, కదలని జాతీయ రహదారుల నిర్మాణాలు, రాజంపేట, మదనపల్లి, ప్రాంతాల్లో పెద్దఎత్తున భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమనం వంటి సమస్యలతో కునారిల్లుతోంది. రాష్ట్రంలోనే జిల్లా ఉద్యాన పంటలకు పుట్టి నిల్లు. జిల్లా మామిడి, అరటి, నిమ్మ, బొప్పాయి, టమోటా తోటలకు ప్రసిద్ధి. ఇటువంటి ఉద్యాన ప్రాంతం వర్షాభావ పరిస్థితుల కారణంగా తల్ల కిందులవుతోంది. ఇటువంటి కరువు ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ కరువు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలును కోరుతూ సాధన కమిటీల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజంపేట పర్యటనపై కథనం...

వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. రాష్ట్రంలో కూటమి సర్కారు పాలన ఆశించిన రీతిలో సాగడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరిస్తామని ఇచ్చిన కూటమి హామీ కేబినెట్ సమావేశాల్లో నామమాత్ర ప్రస్తావన చేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనికితోడు రాజంపేట రైల్వేలైన్ కింద ఆయుబి ఏర్పాటు సమస్య పట్టణాన్ని వేదనకు గురి చేస్తోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలుస్తోంది. జిల్లాలో సుమారు 1.13 లక్ష ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయి. కానీ ఉద్యాన పంటలకు ప్రోత్సాహం కరువైంది. జిల్లాలో అత్యధికంగా 77 వేల ఎకరాల్లో మామిడి, తొమ్మిది వేల ఎకరాల్లో అరటి, తొమ్మిది వేల ఎకరాల్లో బొప్పాయి, ఏడు వేల ఎకరాల్లో టమోటా పంటలు సహా ఇతర పంటలు పెద్దఎత్తున సాగులో ఉన్న సంగతి తెలిసిందే. ఇటువంటి ఉద్యాన జిల్లాకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడి నుంచి పలు రకాల పండ్లు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇంతటి ప్రాముఖ్యతను కలిగిన జిల్లాలో మామిడి తోటలు లేమి కారణంగా తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. అరటి, టమోటా రైతు ధరల నిలకడ లేమి కారణంగా దోపిడీ గురవవుతున్నారు. బొప్పాయి రైతు దళారుల మాయా జాలంలో విలవిలాడుతున్నారు. ఇటువంటి పరిస్థితిని అధిగమించడానికి కూటమి సర్కారు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఉద్యాన పంటలకు నిలయమైన రైల్వేకో డూరులో ఆప్సా వంటి పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రతిపక్ష నేత హొదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. ముది వేడు రిజర్వాయర్ నిర్మాణ పనులు ఎక్కడికి అక్కడే ఆగిన పరిస్థితి కనిపిస్తోంది. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు 80 శాతం పనులు రాజకీయ కారణాలతో నిలిచిపోయింది. ఫలితంగా రాయచోటి, చక్రాయ పేట మండలాల్లో సుమారు 72 చెరువుల కింద వేలాది ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

దీనికితోడు 2025 ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం వెంటా డుతోంది. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 20 మండలాలు సాధారణ వర్షపాతం నమోదు, ఎనిమిది మండలాలు తీవ్ర కరువు మేఘాలు దట్టంగా కమ్ముకోవడం ఆందోళన కలిగిస్తోంది. రాజంపేట నియోజక వర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూని వర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం సాకారానికి నోచుకోవడం లేదు. 20 24 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి న నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి, చీనీ తోటలు సహా పలు ఇతర ఉద్యాన నర్సరీలతో కళకళలాడుతోంది. ఇటువంటి ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో అప్సా వంటి పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు.సాగునీటి ప్రాజెక్టుల పనులు పడకేయడం ఆందోళన కలిగిస్తోంది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో గాలేరు-నగరి కాల్వ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. హంద్రీ-నీవా కాల్వ ద్వారా కుప్పానికి నీళ్లు తరలించడం బాగానే ఉంది. కానీ అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం రిజ ర్వాయర్‌ను విస్మరించడంలో ఆంతర్యమేమిటో తెలియ డం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, ముదివేడు, ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేకపోవడం విస్మయాన్ని కలిగి స్తోంది. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పు డో తెలియడం లేదు. కడప - తిరుపతి జాతీయ రహదారి నిర్మాణం సర్వే దశలో కునారి ల్లుతోంది. దీంతోపాటు కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు. దీంతోపాటు ఓబులవారిపల్లి-కృష్ణపట్నం ప్యాసింజర్ రైలు ఎప్పటికి నడుస్తుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. బెంగళూరు-విజయవాడ ఎన్‌హెచ్ నిర్వాసితులు పరిహారానికి ప్రద క్షిణలు చేయాల్సి వస్తోంది. గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల కిందట అన్న మయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘటనలో నష్టపోయిన బాధితులకు మౌలిక వసతుల కల్పనలో తాత్సారం జరుగుతోంది.

దోబీఘాట్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రాజంపేట మండలం బోయనపల్లిలో పాల్గొనబోయే పేదల సేవ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఆదివారం బోయినపల్లిలో సిఎం ఏర్పాట్లకు సంబంధించి హెలీప్యాడ్, దోబీ ఘాట్, ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారుల ఇళ్లు, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు అను గుణంగా వేదిక నిర్మాణం, పాల్గొనే లబ్ధిదారుల కోసం కూర్చోవడానికి అవసరమైన సదు పాయాలు, తాగునీటి వసతి, శానిటేషన్, పార్కింగ్ సంబంధిత ఏర్పాట్లన్నీ పూర్తయ్యా యన్నారు. ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా అధికార బృందాలు సకాలంలో పనులను పూర్తి చేసారని చెప్పారు. పర్యటనలో ముఖ్యమంత్రి స్వయంగా పలకరించబోయే రజక లబ్ధిదారుల జాబితా, వారికి అందించబోయే ప్రయోజనాలు, సౌకర్యాలు క్షుణ్ణంగా సమీక్షిస్తారన్నారు. సమా వేశానికి హాజ రయ్యే ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేదిక వద్దకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వేదిక పరి సరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సిసి కెమెరాలు, క్షేత్ర స్థాయి భద్రతా బలగాలను విస్తృతంగా మోహరిం చారన్నారు. ప్రజల రాక పోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక చేపట్టామని తెలిపారు. పర్య టనలో పాల్గొనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణ సేవలు అందించేలా వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచా మన్నారు. విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్, శానిటేషన్, రవాణా వంటి విభాగాలన్నీ ఒకే తాటిపై పనిచేస్తూ ఏర్పాట్లను విజయవంతంగా పూర్తి చేశారని కలెక్టర్ వివరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పర్యటన సజావుగా సాగేందుకు అధి కారులు అప్రమత్తంగా ఉంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు క్రమశిక్షణతో పాల్గొని ముఖ్య మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సంబంధిత అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామారావు

శాస్త్రీయ ఆలోచనతోనే అభివృద్ధి

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామారావు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శాస్త్రీయ ఆలోచనతోనే దేశాభివృద్ధి సాధ్యమని జె వి వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభ స్థానిక శివాలయం సర్కిల్లోని జెవివి కార్యాలయంలో ఆదివార నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను రిటైర్డ్ ఎంఇఒ గడి యారం వెంకటేశ్వర్లు, జెవివి జెండాను డాక్టర్ నరసింహారెడ్డి ఆవిష్కరించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు సమీర్ భాష అధ్యక్షత వహించారు. ఇటీవల మృతిచెందిన జెవివి నాయకులు గంగిరెడ్డి, అబ్బాస్ వలీలకు మహాసభ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాల అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎఉహెచ్ సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. శాస్త్ర విద్య విధానంపై బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు సైన్స్ ప్రయోగశాలలు ఏర్పాటు చేసి వారికి శాస్త్రీయత అవగాహన ప్రభుత్వం కల్పించాలన్నారు. శాస్త్ర విజ్ఞానం ద్వారా మూఢ విశ్వాసాలను, చాందస భావాలను అరికట్టాలన్నారు. సత్యాన్వేషణకు దేశసావ లంబనకు, సమగ్రతకు, ప్రపంచ శాంతికి, సామా జిక అభివృద్ధికి, సాంస్కృతిక వికాసానికి కృషి చేయాలని తెలిపారు. జెవి వి జిల్లా గౌరవ అధ్య క్షులు ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి మాట్లా డుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూఢన మ్మకాలను శాస్త్రీయ విద్య ద్వారా పోగొట్టాలన్నారు. జెవివి లాంటి సంస్థల ద్వారా ఈ కృషి మరింత పెరగా లన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ మాట్లాడుతూ పాలకవర్గాలు సాంస్కృతిక దోపిడీ చేస్తున్నాయని చెప్పారు. పాఠ్యాంశాలలో పిరియాడికల్ టేబుల్, జీవ పరిణామ క్రమం తీసేయడం, సెక్యులరిజం ప్రజాస్వామ్యంలోనూ తొలగించడం చరిత్రను వక్రీకరించడమే అని అభిప్రాయపడ్డారు. జెవివి వ్యవస్థాపక నాయకులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ రాజా వెంగల్‌లెడ్డి మాట్లాడుతూ జెవివిద్వారా 37 సంవత్సరాల నుంచి ఆరోగ్యం అందరికీ దక్కాలని అవగాహన కార్యక్రమాలు చేస్తూ, ఆరోగ్యం ప్రజల హక్కు అనే నినాదంతో ప్రచారం చేస్తుందన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న కార్యదర్శి నివేదికను , జిల్లా కోశాధికారి ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించింది. మహిళా భివృద్ధిపై, మూఢనమ్మకాలపై, విద్యపై ,అభివ ృద్ధిపై, పర్యావరణంపై తీర్మానాలను ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్త, సరస్వతి, జిల్లా నాయకులు సునీత, మురళీగుప్త, కామేశ్వరమ్మ, సుజన్ కుమార్, హేమంత్, వేంపల్లి రాజశేఖర్, పవన్ కుమార్, శివరాం ,సునీత, అరుణ, డేవిడ్, ఆరవీడు చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి, హైమావతి, నరేష్, రామసుబ్బమ్మ, నరసింహారెడ్డి, బాలసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

బిసి వృత్తిదారుల నిధులను వారికే ఖర్చు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు : రాష్ట్ర ప్రభుత్వం బిసి వృత్తిదారుల పేరుతో కేటాయించిన బడ్జెట్ నిధులు రూ. 47 కోట్లను వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని, ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమ న్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బిసి వృత్తిదారుల ప్రాంతీయ సదస్సును పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిదారులు, బిసిలకు గతంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. 56 కార్పొరేషన్‌లో చైర్మన్లు, 729 మంది డెరెక్టర్లకు గౌరవ వేతనాలు పేరుతో జీతాలు ఇస్తామని చెప్పి గత ప్రభుత్వం మాదిరిగానే మాటలతో కాలయాపన చేస్తుందని చెప్పారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వృత్తిదారుల పట్ల ఈ ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని నేటికీ ఆర్థికంగా సామాజికంగా చేతివృత్తుల్లో ఉన్న ప్రజలు కునారెళు తున్నారని వాపోయారు. రానున్న కాలంలో వృత్తిదారులందరూ ఐక్యమై ఐక్య ఉద్యమాల ద్వారా మన హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బద్వేల్ గురుమూర్తి జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, దుద్యాల వెంకటరమణ మాట్లాడుతూ బిసిలు చేతి వృత్తిదారుల అభివృద్ధి సంక్షేమం కోసం పాలకులు చెప్పే మాటలే తప్ప ఆచరణ సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. అనంతరం బద్వేల్ ప్రాంతీయ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నికయింది. కార్యక్రమంలో చెప్పలి సుబ్బరాయుడు, తూపల్లి శ్రీనివాసులు, బడబగ్ని పద్మ, గంప సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, నాగరత్నమ్మ, కాల్వపల్లి రామ లక్ష్మమ్మ, దస్తగిరి, కృష్ణ, రాజగోపాల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కె ఎస్ ఆర్ ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ 589/9 పరుగుల వద్ద డిక్లేర్ ప్రకటించింది. 3 వికెట్ల నష్టానికి నష్టానికి 346 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 137.5 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 589 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని జెనిక్ దాస్ 109, తేజ రెడ్డి 161, నికిత్ గౌడ్ 63 పరుగులు చేశారు. కడప జట్టులోని చెన్నారెడ్డి 3, ఎస్ఎండి అస్లాం 2, ధనుష్ రెడ్డి 2 వికెట్లు తీసు కున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 32.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 99 పరుగులు చేసింది. వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న వేరొక మ్యాచ్‌లో 6 వికెట్ల నష్టానికి 374 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 96.4 ఓవర్లలో 514 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 182, భార్గవ్ 75 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 41.5 ఓవర్లలో 132 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. నెల్లూరు జట్టులోని అఖిల్ సాలుంకే 4, మాధవ్ 3, నారాయణ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 10.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 54 పరుగులు చేసింది.

పూర్తిస్థాయిలో నీటిని నింపుతాం

- సర్వరాయసాగర్‌లో గ్రౌటింగ్ పనులు చేపట్టాలి
- జిఎన్ఎస్ఎస్ పరిధిలోని ప్రాజెక్టుల్లో 53 టిఎంసిలు
- జిఎన్ఎస్ఎస్ ఎస్ఇ ఎ.సి.కొండారెడ్డి వెల్లడి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిఎన్ఎస్ఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపుతాం. ఉమ్మడి జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా, భారీ సాగు నీటి ప్రాజెక్టుల పరిధిలో తక్కువ వ్యయంతో కూడిన డిస్ట్రిబ్యూటరీ పనులు చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలపై దృష్టి సారించాం. జికెఎల్ఐ పరిధిలోని డ్రిప్ ఇరిగేషన్ పనుల్లో భాగంగా చేపట్టిన 900 సంపుల్లో 85 సంపుల నిర్మాణ పనుల పూర్తి చేశాం. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్ద దైన మొగమేరు అక్విడక్ట్‌ను పూర్తి చేయడంపై దృష్టి సారించామని గాలేరు-నగరి సుజల స్రవంతి పథకం సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎ.సి కొండారెడ్డితో ముఖా ముఖి...

జిఎన్ఎస్ఎస్ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులెన్ని?

జిఎన్ఎస్ఎస్ పరిధిలో ఆరు చిన్న, మధ్యతరహా, భారీ సాగు నీటి ప్రాజెక్టులున్నాయి. ఒకటి భారీ, ఐదు మధ్య తరహా ప్రాజెక్టులున్నాయి. రాయలసీమకు గుండెకాయ లాంటిది గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, పైడిపాలెం, మైలవరం, సిబిఆర్ ప్రాజెక్టులున్నాయి.

ప్రాజెక్టుల నీటి నిల్వ పరిమాణమెంత?

జిఎన్ఎస్ఎస్ సాగునీటి ప్రాజెక్టులు 54. టిఎంసిల నిల్వకు 40 టిఎంసిలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మిగిలిన 14 క్యూసెక్కులను నింపుతాం.

డిస్ట్రిబ్యూటరీ వివరాలు తెలపండి?

జిఎన్ఎస్ఎస్ పరిధిలో ఫేజ్-2లోని ప్యాకేజీ-1, ప్యాకేజీ-2, ప్యాకేజీ-3 పరిధిలోని గండికోట, సర్వరాయసాగర్, వామికొండ తదితర రిజర్వాయర్ల పరిధిలో భూసేకరణ ప్రక్రియ నడుస్తోంది. 372 కిలోమీటర్ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.400 కోట్ల వ్యయంతో మూడు లక్షల ఎకరాలకు సాగునీటిని టెయిలెండ్ వరకు నీటిని అందించే అవకాశం ఉంది.

ఫేజ్-2లోని నాలుగవ ప్యాకేజీ గురించి వివరించండి?

జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లోని నాలుగో ప్యాకేజీకి ఫారెస్టు సమస్య ఎదురవుతోంది.119 కిలోమీటర్ నుంచి 240 కిలోమీటర్ వరకు నాలుగో ప్యాకేజీ ఉంటోంది. ఇందుకు 2500-2800 ఎకరాలను సేకరించాల్సి ఉంది. ఇందుకుగానూ రూ.2,550 కోట్లు ఫారెస్టు డిపార్టుమెంట్‌కు చెల్లించాల్సి ఉంది.

సర్వరాయసాగర్ లీకేజీ పనుల సంగతేమిటి?

రూ.212 కోట్లతో సర్వరాయసాగర్ ప్రాజెక్టు లీకేజీ నివారణకు గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. లీకేజీ పనులకు సంబంధించి రూ.12 .10 కోట్లు, వామికొండ కింద రూ.8 కోట్ల వ్యయంతో కూడిన పనులకు ప్రతిపాదనలు పంపించడమైంది. రిజర్వాయర్ కట్ట కిందిభాగంలో నీటి లీకేజీని అరికట్టడానికి ఆధునిక సాంకేతికతో గ్రౌటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది.

మైక్రో ఇరిగేషన్ గురించి వివరించండి?

రూ.1,260 కోట్లతో డ్రిప్ ఇరిగేషన్ చేపట్టడమైంది. జికెఎల్ఐ పరిధిలోని 800 సంపుల్లో ఇప్పటికి 120 సంపులు పూర్తి చేయడమైంది. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. ఎల్ఎ సంబంధించిన సమస్య కొనసాగుతున్నందున ఆలస్యంగా సాగుతోంది. ఏదేమై నప్పటికీ సాధ్యమైన మేరకు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇచ్చాం.

మైలవరం కట్ట పునరుద్ధరణ ఎప్పుడో?

మైలవరం, చిత్రావతి రిజర్వాయర్ల కట్టలు కుంగిన మాట వాస్తవమే. గత మైలవరం కట్ట పునరుద్ధరణకు రూ.83 కోట్లతో ప్రతిపాదనలు అందజేశారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ఆమోదం లభించడమే ఆలస్యం.

కాలేటివాగు పురోగతిని వివరించండి?

కాలేటివాగు పనులు 25 శాతంలోపు ఉన్న కారణంగా నివేదిక పంపించాం. పిఎల్ఆర్ కాంట్రాక్టు సంస్థ రూ.5,0030 కోట్లతో టెండరు దక్కించుకుంది. రూ.4,300 కోట్ల పనుల్లో 30 శాతం పనులు చేపట్టింది. కడప జిల్లాలో 40 వేలు, అన్నమయ్య జిల్లాలో లక్ష ఎకరాలు, చిత్తూరు జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాలు వెరసి 2.90 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుంది.

చిత్రావతి-ఎర్రబల్లి ఎత్తిపోతల పురోగతి తెలపండి?

రూ.850 కోట్లతో చిత్రావతి- ఎర్రబల్లి ఎత్తిపోతల పనులు చేపట్టాం. రూ.250 కోట్ల మేర పనులు పూర్తి చేశాం. రెండు టిఎంసిల నీటిని ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయాల్సి ఉంది. ఇందులో వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని ఆరు చెరువులను నింపాల్సి ఉంది. అనంతరం వేంపల్లిలోని గిడ్డంగివారిపల్లి చెరువును నీటిని సరఫరా చేయడం ద్వారా 10 వేల ఎకరాల అదనపు ఆయకట్టు లభించే అవకాశం ఉంది. ఎర్రబల్లి ఎత్తిపోతల పనుల వల్ల యుసిఐఎల్ పరిధిలోని ఆరు నిర్వాసిత గ్రామాలకు శుద్ధ జలాన్ని అందిస్తాం.

నేడు జిల్లాకు జగన్, షర్మిల రాక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ /కడప

మాజీ సిఎం వై.ఎస్. జగన్, పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల జిల్లాకు రానున్నారు. ఈనెల 2న మాజీ ముఖ్యమంత్రి, కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్ఆర్ ఘాట్‌కు వేర్వేరుగా నివాళులర్పించనున్నారు.

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పాటు పులివెందులలో పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు వివిధ కార్యక్ర మాల్లో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిం చాయి. సోమవారం మధ్యాహ్నం పులివెందుల చేరుకోనున్నారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజలను కలుసుకుని, రాత్రికి తన నివాసంలో బస చేస్తారు. 2న ఉదయం ఆయన ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ చేరుకుని తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తారు. ఆ తరువాత లింగాల మండలం అంబకపల్లిలో గంగమ్మకుంట వద్ద నిర్వహించే జలహారతి కార్యక్రమంలో పాల్గొననున్నారు. తరువాత తిరిగి పులివెందుల చేరుకుని, క్యాంప్ కార్యాలయంలో ప్రజలతో భేటీ అవుతారు. రాత్రికి అక్కడే బస చేసి, సెప్టెంబర్ 3న ఉదయం తిరుగు ప్రయాణం అవుతారు.

పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిల సోమవారం కడపకు రానున్నారు. మధ్యాహ్నం 12: 35 గంటలకు కడప విమానాశ్రయానికి చేరు కుంటారు. అక్కడి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యా లయానికి చేరుకుని మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమా వేశమవుతారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు రోడ్డు మార్గాన ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఎస్టేట్‌కు చేరుకుని 2న ఉదయం 8:30 గంటలకు వైఎస్ఆర్ ఘాట్‌కు చేరుకొని రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తారు.

అంబేద్కర్ సర్కిల్ వద్ద నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడు

నిమజ్జనానికి తరలిన గణనాథులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వినాయకచవితి సందర్భంగా ఈ నెల 27న ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి ఆయా గ్రామ ఉత్సవ కమిటీలు తరలించారు. పెద్దముడియం మండలం కుందూనదిలో నిమజ్జనం చేశారు. ముందుగా పట్టణంలోని పురవీధుల్లో గణనాథులను ఊరేగించారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని, బ్యాంకు కాలనీలో యూత్ ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తరలించారు. నిమజ్జనం చేసే కుందూ నది వద్ద ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

రూ.93 వేలు పలికిన శ్రీరాంనగర్ లడ్డూ

ప్రజాశక్తి - వేంపల్లె

గండి రోడ్డులోని శ్రీరాంనగర్ ట్యాంక్ బజార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని లడ్డూను ఆదివారం వేలం వేయగా దేరంగుల విశ్వనాథ్, గంగోజమ్మ రూ.93వేలకు దక్కించుకున్నారు. వినాయకుని నిమ జ్జనం ముందు లడ్డూ, కలశం, రూపాయి దక్కించుకునేందుకు వేలం నిర్వహించారు. వేలం పాటలు స్థానికుల మధ్య హోరాహోరీగా ఉత్సా హంగా సాగాయి. కలశాన్ని పందిబోటి వెంకటేష్ రూ.40 వేలకు దక్కిం చుకున్నారు. రుపాయిని బత్తెన శివ రూ.12వేల 500కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో శ్రీరాంనగర్ ట్యాంక్ బజార్ యూత్ సభ్యులతోపాటు బత్తెన రమణ, బత్తెన రవి, దేరంగుల బాబు, రామాంజనేయులు, వల్లెపు రత్నయ్య, రాజు, చంద్ర, గురు ప్రసాద్, బాబు, గంగరాజు, వెంకటసుబ్బయ్య, సురేష్, రమణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

లడ్డూను తీసుకెళుతున్న దేరంగుల విశ్వనాథ్

పుల్లయ్య తోటలో.. స్థానిక పుల్లయ్య తోటలో లడ్డూ వేలం పాటలో రూ.1.20 లక్షలకు కాలనీకి చెందిన దయ్యం శ్రీనివాసులరెడ్డి దక్కించుకున్నారు. లడ్డూ 16కిలోలు. కలశాన్ని మురళినాథ్‌రెడ్డి రూ.23 వేలకు దక్కించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోండి : సిఐ

వినాయకుని నిమజ్జనంలో నిర్వాహకులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ నర్సింహులు సూచించారు. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల నిమజ్జనం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. రహదారిలో వెళ్లే ప్రజలపై, వాహనదారులపై రంగులు చల్లాకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా గ్రామోత్సవం చేయాలని కోరారు. నిమజ్జనం చేసే సమయంలో పిల్లలను వెంట తీసుకెళ్లవద్దన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉత్సవ కమిటీ బాధ్యత తీసుకోవాలని కోరారు.

లడ్డూను తీసుకెళుతున్న అశోక్‌కుమార్ రెడ్డి

వల్లూరు : గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సి. కొత్తపల్లిలో గణేష్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న వినాయకుని నిమజ్జనం సందర్భంగా ఆదివారం లడ్డు వేలం నిర్వహించారు. లడ్డును దక్కించుకునేందుకు స్థానికులు పోటీపడ్డారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చిలుమూరు అశోక్ కుమార్ రెడ్డి రూ .40500 వేలంలో హెచ్చు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ స్థానికులు వారికి అభినందనలు తెలిపారు. అట్టహాసంగా మేళ తాళాలతో ఊరేగింపుగా అశోక్ కుమార్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను లడ్డును ఇంటికి తీసుకెళ్లారు.

నేడు మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. చైర్మన్‌గా బండి రామసూరారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఓబులేసు, సభ్యులుగా సుజాత, జ్యోతి, వీరభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, శివభాస్కర్‌రెడ్డి, మధుమోహన్ నాయక్ మరికొందరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, కూటమి నాయకులు హాజరుకానున్నారు.

దోమకాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి

- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండే పరిస్థితులు ఎక్కువ ఉన్నందున దోమకాటుకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో దోమ లార్వా విస్తరించి మలేరియా, డెంగీ, చికున్‌గన్యా, ఫైలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ వ్యాధుల వల్ల చిన్న పిల్లలు, గర్భిణులు, వృద్ధులపై ఎక్కువగా ప్రభా వితం అవుతారన్నారు. ప్రతి ఒక్కరూ దోమల నివారణ చర్యల్లో భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, డ్రమ్ములు, బకెట్లపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. పాడైన టైర్లు, కొబ్బరి బొండాలు, సీసాలు, ప్లాస్టిక్ కప్పులు, గుంతల్లో నీరు నిల్వ కాకుండా తొలగించాలని చెప్పారు. ప్రతి వారం నిల్వ నీటిని పూర్తిగా ఖాళీ చేసి శుభ్రపరచాలన్నారు. నీటి గుంటల్లో కిరోసిన్ చల్లితే దోమ లార్వా పెరగదని వివరించారు. సాయంత్రం నుండి ఉదయం వరకు దోమలు ఎక్కువగా కుడుతాయి. ఆ సమయంలో దోమతెరలు వాడాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు పూర్తిగా శరీరం కప్పే దుస్తులు ధరించాలన్నారు. జ్వరం, వాంతులు, కళ్లు ఎర్రబడడం, శరీర నొప్పులు, తలనొప్పి వంటి లక్షణాలు కనపడితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. డెంగీ వంటి వ్యాధులు సోకితే స్వయంగా మందులు వాడకూడదని తెలిపారు. వైద్యుల సూచన మేరకే చికిత్స పొందాలని కోరారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్య విభాగం తరచూ ఫీవర్, లార్వా సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నత్తనడకన మురుగు కాల్వ పనులు

ప్రజాశక్తి - ముద్దనూరు

అభివృద్ధిలో భాగంగా ముద్దనూరులో జరుగుతున్న మురుగుకాల్వ, ఫుట్‌పాత్ నిర్మాణ పనులు నత్తనడకన నాసిరకంగా సాగుతున్నాయి. జమ్మలమడుగు రహదారిలోని రైల్వేగేటు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు కిలో మీటర్ మేర రూ.9కోట్లతో రోడ్డు, రోడ్డుకు ఇరు వైపులా మురుగుకాల్వ, ఫుట్‌పాత్, టైల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. పనులు ప్రారంభించి 6నెలలు అవుతున్నా ఇప్పటికీ అరకొరగానే జరుగుతున్నాయి. రోడ్డుకు ఒక వైపు మురుగుకాల్వ పూర్తి చేసి ఫుట్‌పాత్‌పై అరకొరగా టైల్స్ ఏర్పాటు చేశారు. టైల్స్ నాసిరకంగా వేయడంతో వేసిన కొద్ది రోజులకే ఊడిపోయాయి. ఫుట్‌పాత్ పైన కొందరు తోపుడు బండ్లు, టీ షాపుల వద్ద కుర్చీలు, కిరాణా షాపు యజమానులు బస్తాలు వేయడంతో నడిచేందుకు వీల్లేక బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు చేపట్టిన మురుగు కాల్వ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరి కొందరు కాల్వ పైనే నిర్మాణాలు చేపడుతున్నా జాతీయ రహదారి అధి కారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపి స్తున్నారు. కాంట్రాక్టర్ పనులను నెలల తరబడి చేస్తుండడంతో తీవ్ర అవస్థలు పడు తున్నామని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డు భద్రతా నియమాలను పాటించక పోవడంతో కాలుష్యం విపరీతంగా పెరిగి పోయిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ కోసం గృహాల ముందు గుంతలు తీయడంతో ఇళ్లల్లో నుంచి బయటికి వచ్చేందుకు మహిళలు, పిల్లలు నానా తంటాలు పడుతున్నారు. ప్రమాదవ శాత్తూ కాలు అదుపు తప్పి గుంతలో పడితే కాలు, చెయ్యి విరిగే ప్రమాదం ఉందని ప్రజలు హడలి పోతున్నారు. పొరపాటున గుంతలో ఏర్పాటు చేసిన కడ్డీలపై పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని మహిళలు, ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. జాతీయ రహదారి అధికారుల పర్య వేక్షణలేని కారణంగా కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా మందకొడిగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఇరు వైపులా వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడు తోందని వాహన దారులు, ప్రయాణికులు వాపో తున్నారు. ఫుట్‌పాత్‌పై బాటసారులు నడిచేం దుకు అడ్డుగా పెట్టిన వాటిని తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరు తున్నారు. పనులు ఆలస్యంగా చేయడం వల్ల ఎప్పటికీ పూర్తి చేస్తారోనని వాహన దారులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. పనులు త్వరిత గతిన పూర్తి చేసి రోడ్డు, మురుగు కాల్వ, ఫుట్ పాత్ అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం

పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం. పనులు పరిశీలించి బిల్లులు మంజూరు చేస్తాం. ఆగస్టు నాటికి రోడ్డు, కాల్వ, ఫుట్‌పాత్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్ మరో 3నెలల సమయం కావాలని కోరారు. ఉన్నతాధికారులు పరిశీలించి పొడిగించడం జరుగుతుంది. పనులు ఆపకుండా కొనసాగించాలని సూచించినట్లు చెప్పారు. పనులు పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసు కుంటాం. రోడ్డు, కాల్వ, ఫుట్‌పాత్ నాణ్యత ఐదేళ్ల వరకు కాంట్రాక్టర్‌దే బాధ్యత.

- చంద్రశేఖర్ రెడ్డి, డిఇ, ఎన్‌హెచ్

పనులు త్వరగా పూర్తి చేయాలి

పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తి చేయాలి. రోడ్డు భద్రతా నియమాలను పాటించక కాలు ష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురుగుకాల్వ కోసం తీసిన గుం తలతో నానా అవస్థలు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- అబ్దుల్ ఖాదర్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక తాతిరెడ్డి రామలింగారెడ్డి నర్సింగ్ హోంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్‌కు విశేష స్పందన వచ్చింది. డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ రెడ్డి హృదయ సమస్యలపై దాదాపు 70 మంది రోగులను పరీక్షించారు. నాడీ సంబంధిత సమస్యల రోగులు 50మందిని డాక్టర్ ఎ.సౌమ్యరెడ్డి పరీక్షించారు. తాను హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తున్నానని, ఎ.సౌమ్యరెడ్డి హైదరాబాదు సనత్‌నగర్‌లో ఉన్న లెనోవా నీలిమ హాస్పిటల్స్‌లో న్యూరాలజిస్ట్‌గా పని చేస్తున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంత వాసులుగా తాము ఇక్కడి రోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కండరాల బలహీనత, చేతుల వణుకు, మాట తడబడడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి లక్షణాలు కలిగిన వారు నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. అధిక రక్తపోటు, గుండెలో రంధ్రాలుగల రోగులకు పలు సూచనలు చేశారు. అడిగిన వెంటనే హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన తాతిరెడ్డి రామలింగారెడ్డి హాస్పిటల్ డాక్టర్ టి.లక్ష్మిరెడ్డికి, గైనకాలజిస్ట్ సుచరితకు, సిబ్బందికి వారు ధన్యవాదాలు తెలిపారు.

వైద్య సేవలందిస్తున్న కార్డియాలజిస్ట్ కిరణ్‌కుమార్‌రెడ్డి, న్యూరాలజిస్ట్ ఎ.సౌమ్యరెడ్డి

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సామాజిక సేవా కార్యక్రమాలను రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతం చేయాలని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం నూతన రోటరీ క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి సేవా దృక్పథంతో సమాజానికి సేవ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. నూతన రోటరీ క్లబ్ అధ్యక్షుడు మారెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సదుద్దేశంతో ఈ అవకాశం కల్పించిన రోటరీక్లబ్ జిల్లా కమిటీ, మాజీ కమిటీ అధ్యక్షకార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు. తమకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని మరింత సమాజాభివృద్ధికి, సామాజిక సేవకు సన్నద్ధమవుతావని తెలిపారు. అంతకుముందు జమ్మలమడుగు రోటరీక్లబ్ నూతన కార్యవర్గంలో భాగంగా రోటరీక్లబ్ అధ్యక్షుడుగా ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి, సెక్రటరీగా ఈ.సంజీవ రాయుడు, మరికొందరు నూతన సభ్యులుగా ఇన్స్టాలేషన్ అధికారి పాస్ట్ పిడిజి సాధు గోపాలక్రిష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ పి.నాగేశ్వరరెడ్డి, రోటరీ క్లబ్ జోనల్ సెక్రటరీ కుండా భాస్కర్, జమ్మలమడుగు అర్బన్ సిఐ పి.నరేష్, ముద్దనూరు సిఐ దస్తగిరి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు రోటరీక్లబ్ పెద్దలు సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్తగా బోరు వేసినట్లు ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతుండడంతో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండల గ్రాంట్ నుండి బోరు వేసేందుకు నిధులు విడుదల చేశారు. ఆ మేరకు ఆదివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 600 అడుగుల బోరు వేశారు. రెండున్నర ఇంచ్ నీరు పడిందని ఎంపిటిసి తెలిపారు. విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తొలగాయని ఆయన పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అవరణలో వేస్తున్న బోరు

విజృంభిస్తున్న విషజ్వరాలు..రక్త పరీక్షల పేరుతో దోపిడీ

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం-చీకటి పడితే చాలు.. జనంపై దోమల దండయాత్ర

రోడ్లపై ఉన్న మురుగు నీరు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వైరల్ పంజా విసురుతోంది. ఆయా గ్రామాల్లో ప్రజలు జ్వరం, ఒళ్లు నొప్పులతో అల్లాడిపోతున్నారు. పల్లే నుంచి పట్టణం వరకు ఇదే పరిస్థితి. వైద్యం కోసం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పరుగులు పెడుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చీకటి పడితే చాలు జనంపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాపిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విషజ్వరాల పేరుతో కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రులు బాధితులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వాతావరణంలో మార్పు వల్ల విష జ్వరాలు అధికమయ్యాయి. వ్యాధులతో ప్రజానీకం తల్లడిల్లిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది ఆర్ఎంపి, పిఎంపిల వద్దనే చికిత్స చేయించుకుంటున్నారు. జలుబు, దగ్గు, తుమ్ముల తో పాటు జ్వరం వస్తూపోతూ ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. విషజ్వరాలు పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా మలేరియా, టైఫాయిడ్ లక్షణాలతో వస్తున్న వారు అధికంగా ఉంటున్నారు. డెంగీ తరహా జ్వరాలు, వైరల్ ఫీవర్స్ బాధితులు ఉంటున్నారని, వీరిలో ఎక్కువ మందికి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయని ఆయా ఆస్పత్రుల వైద్య నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ఆస్పత్రుల నిర్వాహకులు అధిక మొత్తంలో ఫీజులతోపాటు డెంగీ పేరుతో అన్ని రకాల రక్త పరీక్షలు చేసి రోగుల వద్ద రూ.వేలల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం. డెంగీ, టైఫాయిడ్, మలేరియా, ప్లేట్లెట్స్ కౌంట్‌తోపాటు మరిన్ని పరీక్షలు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. డెంగీ పరీక్షకు రూ.750 నుంచి రూ.1000, మలేరియా, టైఫాయిడ్ పరీక్షకు రూ.400 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. మిగిలిన పరీక్షలకు మరో రూ.1,500 వసూలు చేస్తున్నట్లు సమాచారం. జ్వర బాధితులకు పరీక్షలకే సుమారు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చవుతోందని బాధితులు పేర్కొంటున్నారు. డాక్టర్ ఫీజు, మందులు, ఇతర ఖర్చులకు మరో రూ.2 వేల భారం పడుతోంది. గ్రామీణ, పట్టణ కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో దోమల ఉధృతి పెరిగింది. ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణ కోసం అరకొర చర్యలు మాత్రమే చేపడుతోంది. ఇంకోవైపు గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో పాలకవర్గాలు పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోలేని పరిస్థితి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చాలా వరకు డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. ప్రభుత్వ వైద్యశాలల్లో పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారణ అయిన కేసులనే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. బయట రక్త పరీక్ష కేంద్రంలో వచ్చే కేసులను నమోదు చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో సక్రమంగా సేవలు అందకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కూడా రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారనే విమర్శలున్నాయి. జ్వర బాధితులకు ప్లేట్లెట్స్ తగ్గు తున్నాయని, ఐదారు రోజులు ఆస్పత్రిలోనే ఉండాలని సిబ్బంది చెబు తున్నారు. ఈ నేపథ్యంలో రోజుకి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు రోగుల నుంచి పిండేస్తున్నట్లు తెలుస్తోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో బోర్డులు ఏర్పాటు చాలా కేంద్రాల్లో ఇవి కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రయివేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని రోగులు కోరుతున్నారు.

వైవీయూ అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం ఎంసిఎ విభాగంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సిద్ధవటం శివజ్యోతికి కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తిరుపతి ఎస్‌వియు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ. రామమోహన్ రెడ్డి పర్యవేక్షణలో 'జనరేషన్ ఆఫ్ ర్యాండమ్ ఫీల్డ్స్ ఫార్ ఇమేజ్ ఎన్ హాన్స్ మెంట్ అండ్ సెగ్మెంటేషన్' అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనకుగాను రాయలసీమ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

నూతన కమిటీతో రాష్ట్ర నాయకత్వం

ప్రయివేట్ విద్యా సంస్థల సమస్యలు పరిష్కరించాలి

'అప్స' రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు కోరారు. ఆదివారం చలమారెడ్డి పల్లెలోని హిల్స్ వ్యాలీ హాలులో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మీడియాతో మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట అప్స ఏర్పాటు చేశామని తెలిపారు. అనేక సమస్యలను పోరాడి సాధించుకున్నామని చెప్పారు. మరిన్ని సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సలహాదారు సుందరరావు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ విడుదల చేసిందని, సొంత వాహనాలు, టూరిస్ట్ వాహనాల కాల పరిమితిని 15 నుంచి 20 సంవత్సరాలకు పెంచారని తెలిపారు. ప్రయివేట్ స్కూల్లో వాహనాలకు ఇదే స్థాయిలో కాల పరిమితి పెంచాలని చెప్పారు. గ్రీన్ టాక్స్ తగ్గింపుపై ఆర్డినెన్స్ ఇచ్చారు కానీ ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. విద్యుత్ కేటగిరీని 2 నుంచి 7 కు మార్చాలని కోరారు. క్రీడా మైదానాలను ప్రభుత్వ స్థలాల్లో అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. 8 ఏళ్లుగా ఉన్న రెన్యువల్ గడువును పదేళ్లకు పెంచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్‌రెడ్డి, కోశాధికారిగా సంజీవరావును ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ పి.భాస్కరరావు, గౌరవ సలహాదారులు జనార్ధన రావు, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తేజస్విని, వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు కళ్యాణి

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

- వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు కళ్యాణి

ప్రజాశక్తి - కడప

15 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ పూర్తిగా కరువైందని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షులు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కడప జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా మహిళలను అందరినీ కలుపుకొని ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో మహిళల రక్షణ కోసం, మహిళల సాధికారత కోసం పెద్దపీటవేశారన్నారు. ఒక మహిళా పక్షపాతిగా జగనన్న ఐదేళ్ల పాలన సాగించారన్నారు. ఇచ్చిన ప్రతి పథకంలో మహిళలే ఎక్కువగా లబ్ధిదారులుగా ఉండేటట్లుగా చూశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించి, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి, జిల్లా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన : సిపిఎస్ ఉద్యోగులందరికీ పాత పింఛను అమలు చేయాలని ఎస్‌టియు సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు. సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో దేశ వ్యాప్తంగా సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా వ్యవహరిస్తూ గత 20 ఏళ్లుగా వర్తమాన ఉద్యోగ, ఉపాధ్యాయులను పిఎఫ్ ఆర్‌డి అనే ఊబిలోనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెట్టాయన్నారు. వెంటనే జిపిఎస్, యుపిఎస్ వంటి కొత్త పింఛన్ పథకాలను రద్దుచేసి పాత పింఛన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోడీ, బాబు, జగన్ రాయలసీమ ద్రోహులు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : నరేంద్ర మోడీ, చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయల సీమ ద్రోహులని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ ముగ్గురి పాలనలో రాయలసీమకు నవ మోసాలు జరిగాయని విమర్శించారు. 1937 నాటి శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టులలో ఒకటి రాయలసీమలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. ఈ రెండింటిలో ఒకటి కూడా రాయలసీమలో ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. రాయలసీమకు శాశ్వితంగా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా రాష్ట్రానికి ప్రత్యేకించి రాయలసీమకు వరప్రసాదిని, సంజీవని లాంటిదని తెలిపారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. మాటలతో కాకుండా చేతలతో రాయలసీమ అభివృద్ధికి దోహద పడాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో డిఎస్‌సి అభ్యర్థులకు అవస్థలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణులై నియామకాల కోసం వేచి ఉన్న అభ్యర్థులు విద్యాశాఖ ఉన్నతాధికారుల చర్యలతో కష్టాలు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఇతర విషయాలపై జిల్లా స్థాయిలోని విద్యాశాఖ అధికారులకు ఏమాత్రం సమాచారం లేదన్నారు. ప్రతి విషయం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల సూచనలతోనే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. డిఎస్‌సి అంటే డిస్టిక్ సెలక్షన్ కమిటీ నా లేక డైరెక్టరేట్ సెలక్షన్ కమిటీ నా అనే అనుమానం కలుగుతుందని పేర్కొన్నారు. కాల్ లెటర్ల డౌన్‌లోడ్ నుంచి ధృవపత్రాల పరిశీలన వరకు అభ్యర్థులకు సరైన సూచనలు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

ప్రజాశక్తి - కడప

వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ సుభాన్‌బాష, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేర్ అన్నారు. కడప నగరం 23వ డివిజన్ ఐస్ క్రీమ్ రవి ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఘనంగా సుభాన్‌బాషాను, ఉమర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు, ప్రజలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఉమర్, సుభాన్‌బాషా

వైవీయూ స్కాలర్‌కు మూడు ఉద్యోగాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో పరిశోధక విద్యార్థిని సారిక ఇటీవల నిర్వహించిన డిఎస్‌సి పరీక్షల్లో ఆంగ్ల విభాగంలో 3 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో ఓపెన్ కేటగిరీలో డిస్ట్రిక్ట్ లో 77.83 మార్కులతో 19వ ర్యాంకు, పిజిటి ఇంగ్లీష్‌లో నాల్గవ జోన్‌లో 16వ ర్యాంకు, టిజిటిలో 4వ జోన్ పరిధిలో 57వ ర్యాంకు సాధించారు. కడప నగరానికి చెందిన ఎం.జె కుంట కాలనీలో నివాసముంటున్న వినాయకుమార్, కుమారి దంపతుల ప్రథమ కుమార్తె సారిక. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం గురువుల సహకారమే తన విజయానికి కారణం అన్నారు. తన విజయానికి సహకరించిన రీసెర్చ్ సూపర్‌వైజర్ డాక్టర్ ఆర్.వి. జయంత్ కశ్యప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.